బుధవారం 23 ఆగష్టు 2023
www.warangalvoice.net

# పెరిగిన దివ్యాంగుల పింఛన్

### రూ.4,016కు పెంచుతూ ధృవ పత్రాల జారీ

### లబ్ధిదారులకు అందజేసిన మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న అపర భగీరథుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆసరా పెన్షన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి పాల్గొని మాట్లాడారు. ముందుగా రూ.3,016 దివ్యాంగుల పెన్షన్ ను రూ.4,016 కు పెంచుతూ మంజూరు చేసిన పత్రాలతోపాటు కళ్యాణ లక్ష్మి చెక్కులను కలెక్టర్ తో కలిసి లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఆసరా పెన్షన్ల అందజేయడంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, పెద్ద వంగర ఎంపీపీ ఈదురి రాజేశ్వరి, దేవస్థాన కమిటీ చైర్మన్ శర్మ, డీ ఆర్ డీఓ సన్యాసయ్య, అడిషనల్ డీఆర్డీఓ వెంకట్, ఆర్డీవో నరసింహారావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



**పాలకుర్తి, వల్మీడి ఆలయాలకు విరాళం..**

రిటైర్డ్ డీఈవో, ఆదర్శ లా కళాశాల కరస్పాండెంట్ బూర విద్యాసాగర్ గౌడ్ పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి రూ.5 లక్షలు, వల్మీడి శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయానికి రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి బుధవారం బూర విద్యాసాగర్ గౌడ్ సంబంధిత చెక్కులను అందజేశారు. కాగా, తన నియోజకవర్గంలోని ఆలయాలకు విరాళం ఇచ్చిన బూర విద్యాసాగర్ గౌడ్ ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు.

# కేసీఆర్ పతనానికి ఎన్నికలే శంఖారావం

### అక్రమ అరెస్టులు ఓటమికి సంకేతాలు

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అవినీతి అక్రమాలపై నిలదీస్తే అరెస్టులు చేయిస్తున్నారంటే కేసీఆర్ ఓటమి ఒప్పుకున్నట్లేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వరంగల్ తూర్పు ఇంచార్జి కుసుమ సతీష్ బాబు అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్స్ అవినీతిపై వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముట్టడిలో భాగంగా బుధవారం పోలీసులు అరెస్టులు చేయడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, హామీలను సంక్షేమ పథకాలను అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు అందించడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్స్ ఇప్పించాలనే కారణంగా ప్రజల పక్షాన బీజేపీ వరంగల్ తూర్పు నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట నల్ల జెండాలతో ధర్నా, నిరసన చేశారు. అర్ధ రాత్రుళ్ళు బీజేపీ కార్యకర్తలను నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం దేనికి సాంకేతాలు అని ప్రశ్నించారు. గడీల పాలనను బద్దలు కొట్టే రోజు దగ్గర్లోనే ఉన్నాయని త్వరలో ప్రజలే కేసీఆర్ పాలనకు బుద్ది చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో భైరి శ్యాం సుందర్, ఆడెపు వెంకటేశ్వర్, కందిమల్ల మహేష్, గంటా రవికుమార్, భైరి శ్యామ్, కందిమల్ల మహేష్, ఆడెపు వెంకటేష్, ఇనుముల అరుణ్, గొకే వెంకటేష్, చిలువేరు రాజేందర్, తెల్లబోయిన చంద్రమోహన్, బొద్దు రాకేష్, కుసుమ సీను, కంద్రాతి సీను, ఇనుముల రాజు, మాచర్ల చిన్నారావు, మైదం వీరాస్వామి, కట్టర్ సతీష్, అల్లి అజయ్, ఓం ప్రకాష్ కొలారియా, రాష్ట్ర జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**గంటా రవికి గాయాలు..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గంట రవి కుమార్ కు గాయపడ్డారు. దీంతో ఆయనను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు.

# మోసగాడి అరెస్టు

### మహిళను కాపాడిన పోలీసులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** షేర్ చాట్, స్నాప్ చాట్ ఆండ్రాయిండ్ యాప్ల ద్వారా యువతలను మోసం చేస్తూ డబ్బు, బంగారం దండుకున్న యువకుడిని హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేయడంతో పాటు, సకాలంలో స్పందించి ఈ మాయగాడి వలలో పడిన హసన్పర్తికి చెందిన యువతిని రక్షించారు. ఈ సంఘటనలో పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, సత్యసాయి జిల్లా, కొత్త చెరువు మండలం, కలమర్ల గ్రామానికి చెందిన ఇమ్రాన్ ను అరెస్టు చేసారు. ఈ అరెస్టు సంబంధించి కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు కథనం ప్రకారం సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఇమ్రాన్ షేర్ చాట్, స్నాప్ చాట్ యాప్ ల ద్వారా గుర్తు తెలియని మహిళలు, యువతులతో ఛాటింగ్ ముసుగులో వారితో పరిచయం పెంచుకొని డబ్బు, బంగారు నగలను దోచుకొనేందుకు ప్రణాళిక వేశాడు. ఇందులో భాగంగా గత రెండు నెలలగా హసన్ పర్తి మండలానికి చెందిన మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయంతో ఇరువురు షేర్ చాట్ యాప్ ద్వారా వీడియో కాల్స్ చేసుకోవడం కూడా ప్రారంభించారు. నిందితుడు తాను ధనికుడినని, సత్యసాయి జిల్లాలో సొంత ఇల్లు ఉందని, తన వద్దకు వస్తే ఇద్దరం కల్సి ఉందామని మహిళను నమ్మించారు. ఇమ్రాన్ సూచనల మేరకు మహిళ తన బంగారు ఆభరణాలను తీసుకొని ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి వెళ్ళి సత్యసాయి జిల్లాలోని నిందితుడిని కలుసుకుంది. ఇద్దరం కలిసి జీవించేందుకుగాను డబ్బు అవసరమని, తిరిగి ఇస్తానని నమ్మించి ఆమె వద్ద వున్న బంగారంలో కొంత బంగారు ముత్తూట్ లో తాకట్టుపెట్టి రూ.1.5 లక్షలు తన ఖాతాలోకి మళ్ళించుకున్నాడు. అనంతరం సదరు మహిళతో కలిసి మూడు రోజులు అక్కడే ఉండి అనంతరం వైజాగ్, గాజువాక, విజయవాడ, బెంగుళూరు, హంపి ప్రాంతాల్లో అతిథిగృహాలతో పాటు, తెలిసిన స్నేహితుల ఇంటిలో బసచేశారు. ఇంటి నుంచి మహిళ అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు హసన్ పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడితో పాటు, మహిళ కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. బుధవారం రోజు నిందితుడు సదరు మహిళతో కలిసి రైలులో హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా



విజయవాడకు వెళుతున్నట్లుగా గుర్తించిన హసన్ పర్తి పోలీసులు కాజీపేట రైల్వే స్టేషన్ లో తనిఖీలు నిర్వహించారు. నిందితుడితోపాటు మహిళను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు, గతంలోను ఇలాంటి నేరాలకు పాల్పడినట్లుగా ఇమ్రాన్ అంగీకరించారు. బాధిత మహిళను క్షేమంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో కీలకంగా నిలిచిన కాజీపేట ఏసీపీ డేవిడరాజు, హసన్పర్తి ఇన్ స్పెక్టర్ గోపి, ఎస్.ఐ రాజు, ఏ.ఏ.ఓ సల్మాన్పషా, క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతికుమార్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించడంతో పాటు గుర్తు తెలియని వ్యక్తులతో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకోవద్దని అది ప్రమాదకమని యువతకు పోలీస్ కమిషనర్ సూచించారు.

## నాన్ లే అవుట్ వెంచర్ లపై కఠిన చర్యలు

### కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్

### పంథిని గ్రామంలో హద్దు రాళ్ల తొలగింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాన్ లేఅవుట్ వెంచర్లు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ హెచ్చరించారు. వరంగల్ జిల్లా ఐనవోలు మండలం పంథిని, పున్నేలు గ్రామాల పరిధిలో అక్రమ వెంచర్ల ఏర్పాటుపై ఆయన సీరియస్ అయ్యారు. పంథిని గ్రామంలోని సర్వే నంబర్ 26 లోని సుమారు ఆరు ఎకరాల్లో లోకేష్, సాగర్ రెడ్డి చేసిన అక్రమ వెంచర్ హద్దు రాళ్లను బుధవారం కుడా సిబ్బంది తొలగించారు. ప్రహరీ కూల్చివేశారు. సదరు వ్యక్తులకు నోటీసులను సైతం అందజేశారు. అలాగే పున్నేలు సర్వే నంబర్ 81 లో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన వెంచర్తో పాటు అదే గ్రామ పరిధిలోని 583 సర్వే నంబర్ లోని 20 గుంటలు విస్తీర్ణంలో ఉన్న మరో నాన్ లేఅవుట్ వెంచర్ పై కూడా కుడా అధికారులు చర్యలు చేపట్టారు. భూ యజమానులకు నోటీసులు అందజేశారు. ఎవరు నాన్ లేఅవుట్ వెంచర్లు చేసినా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు చేపడతామని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ప్రకటించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేస్తే కుడా అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అంతే కాకుండా నాన్ లేఅవుట్ ప్లాట్లను కొనుగోలు చేసి వినియోగదారులు ఇబ్బందులు పడొద్దని సలహా ఇచ్చారు. గృహ నిర్మాణ అనుమతులు, మౌలిక వసతుల లేమీతో ఇప్పటికే పలువురు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. భూ యజమానులు ఎవరైనా వెంచర్ ఏర్పాటు చేయదలిస్తే కుడా ఆధ్వర్యంలో పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో వెంచర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవలే ఉనికిచర్లలో సైతం కుడా లేఅవుట్ వెంచర్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. కావున వినియోగదారులెవరూ నాన్ లేఅవుట్ వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేసి నష్టపోరాదని సుందర్ రాజ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## చంద్రయాన్-3 సక్సెస్

### దేశవ్యాప్తంగా సంబురాలు, ఫలించిన భారత ప్రజల పూజలు

**వరంగల్ వాయిస్, బెంగుళూరు :** భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 బుధవారం సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై కాలు మోపింది. ఎలాంటి అడ్డంకులు లేకుండా చంద్రుడి దక్షిణ ధృవంపై సేఫ్ గా ల్యాండ్ అయింది. ఎన్నో దేశాలకు సాధ్యం కాని విజయాన్ని భారత్ అందుకొని చరిత్ర సృష్టించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ సక్సెస్ కావాలంటూ బుధవారం దేశ వ్యాప్తంగా దేవాలయాల్లో భారత ప్రజలు చేసిన పూజలకు ఫలితం దక్కింది. జులై 14న శ్రీహరికోట నుంచి నింగికెగిసిన స్పేస్క్రాఫ్ట్ 40 రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం చంద్రుడి దక్షిణ ధ్రువానికి 70 డిగ్రీల అక్షాంశం దగ్గర అడుగుపెట్టింది. దీంతో దేశవ్యాప్తంగా భారత పజలు సంబురాలు జరుపుకున్నారు. బాణ సంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు.

**భద్రకాళి గుడిలో పూజలు..**

చంద్రయాన్ సక్సెస్ కావాలంటూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో చంద్రుడిపై సేఫ్ గా ల్యాండింగ్ కావాలని కోరుకున్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి, శాస్త్రవేత్తల కఠోరమైన కృషికి ఆ భగవంతుడి అనుగ్రహం కూడా తోడవ్వాలని, అమ్మవారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నిరంజన్, కొండం రవీందర్ రెడ్డి, శ్రావణ్ యాదవ్, గీద రవీందర్ రెడ్డి, చందు, నల్లా రమేష్, గోపి కృష్ణ, అనిల్, భాస్కర్, సతీష్, అశోక్, తిరుపతి, అరవింద్ తోపాటు బీజేపీ నాయకులు, వరంగల్ యువత, మహిళలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బోనమెత్తిన మేయర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాలివాహనుల (కుమ్మరుల) తొలి బోనం సమర్పణ కార్యక్రమంలో భాగం గా బుధవారం బల్దియా పరిధిలోని 40వ డివిజన్ కాశీకుంట, కరీమాబాద్ లోని పోచమ్మ ఆలయాల్లో నగర మేయర్ గుండు సుధారాణి బోనమెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు మేయర్ ను శాలువాతో సత్కరించారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక శాలివాహన నేతలు అవునూరి రాములు, అవునూరి భిక్షపతి, అవునూరి నాగరాజు, అవునూరి రామన్న, అవునూరి ఆనందం, అవునూరి సంతోష్, కందికుంట కుమారస్వామి, కట్కూరి రాజేష్, అవునూరి కుమారస్వామి, అవునూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com